


# నైతికానైతికాతీతం

వడ్డెర చండీదాస్

తొక్కుడు బిళ్ళాటలో గెలిచి, పక్కింటివాళ్ళ సీతను నేల మీదకి తోసేసి, వాళ్ళ పని గుంటణ్ని నాలికతో వెక్కిరించి కుంతలవరాళి తిల్లానా లాగా చెంగున గుంద్రంగా గెంతుతూ వాకిట్లో కొచ్చిన నీలం రంగు పట్టు పావడా వోణీలో బుట్టబొమ్మలా వున్న పదహారేళ్ళ రెండు జడల పసిమి గౌరి—

కుండబొజ్జ నిండా గ్లాసుడు కాఫీ పోసి, ముందు వరండా అరుగుమీద కూచుని, పొగాకు పాయ తీసి, నాలికతో తడిచేసి, చుట్ట చుట్టుకుంటున్న రాఘవయ్య. బట్ట తలమీద యెడంచేతి వేళ్ళతో గోక్కుంటూ అలా తన కూతురు గౌరిని చూసి, "అటా పిచ్చి తిరుగుళ్ళు తిరగొద్దన్లామ్మా?" అని ఆప్యాయంగా మందలించాడు.

వినిపించనట్టుగా లోపలికి గెంతుతూనే వెళ్ళింది గౌరి.

బళ్ళోకి వెళ్ళమంటే అయిష్టంగానే వెళ్ళి, మేసర్లు పాస్చేస్తూ వొచ్చినందు వల్ల, తొమ్మిదో తరగతిదాకా లాక్కొచ్చింది గౌరి. తనకి చదువూ పుస్తకాలూ అంటే సరిపడదు. అవేవీ బుర్రలోకి యెక్కనూ లేదు.

కులాసాగా పిల్లల్తో ఆడుకుంటూ తిరగటం ఇష్టం. కాదంటే, పొలాల్లో పుట్టా చెట్టూ వెంట తిరగటం ఇష్టం. వాళ్ళ ఇల్లు వూరికి కాస్త పెడగా వుంటుంది. ఇంటికి కనిపిస్తూనే వాళ్ళ భూమి-మాగాణీ, మెట్ట.

సెలయేటి గలగలలా, లలితంగానూ అలజడిగానూ మధురంగానూ నవ్వుతూ వుంటుంది యెప్పుడూ. యెప్పుడోగానీ యేడవదు. మూడేళ్ళ కింద పక్కింటివాళ్ళ పిడకల గూట్లో సీతతో ఆడుకుంటూండగా రజస్వలయ్యి. యేదో కోసుకుపోయిందని భయంవేసి బాధపెయ్యకపోయినా, కోసుకున్నందుకు వాళ్ళమ్మ తిడుతుందని యేడ్చింది. తొమ్మిదేళ్ళప్పుడు తనకెంతో యిష్టమైన రబ్బరు ఆటబొమ్మ (కనకదుర్గమ్మ) పోయినప్పుడూ ఆమెకి యేడుపొచ్చింది. నిరుడు తొమ్మిదో తరగతిలో వొకసారి ఓ పిల్లడి చేతివేలు తలుపు సందులో నొక్కుని చితికితే, జాలేసి బాధేసి తన చేరుమాలతో కట్టుగడితే; మూడోనాడు ఆ సంగతి వాళ్ళమ్మకి తెలిసి తిడితే: యెందుకు తిడుతున్నదో తెలియక యేడ్చేసింది. ఆ తరవాత వొకసారి సీత వేలు కోసుకుపోతే తనకి బాధేసి "నే కట్టు గడ్తే మా అమ్మ నన్ను తిడ్తుంది" అని

యేడ్చేసింది అలా యెప్పుడో గానీ ఆమెకి యేడుపు రాదు. మరెప్పుడూ నవ్వుతూ వుంటుంది.

ఆర్నెల్ల నాడు గౌరికి పెళ్ళైంది. మొగుడు, వెంకట్రావు యెర్రగా బుర్రగా వుంటాడు. యేజీ బియ్యేస్సీ చదివాడు.

యాభయ్ వేల దగ్గిర పాట మొదలెట్టినా ఆఖరికి డబ్భయ్ వేలకి అల్లుణ్ని కొనేశాడు రాఘవయ్య. తీరా పెళ్ళప్పుడు. డబ్బుకు బదులు తొంభయ్ వేల ఖిమ్మతుకి భూమి చూపెట్టి. అల్లుడిపేర పెడ్తానన్నాడు. పెళ్ళికాస్తాకానిచ్చి. యెవరి పేర వుంటే యెంలే అనే లెక్కలోకి వొచ్చాడు. ఇంకా యెవరి దగిరా బయటపెటలేదు గానీ, యే వుద్యోగం జోలికీ పోనీకుండా యేజీ బియ్యేస్సీ అలుడుకదా. పదివేలు ఖర్చు చేసి మూడు లక్షలు ట్రాక్టర్లకి లోను లాగి. వేరే అప్పు తియించి ట్రాక్టర్ల ఇప్పించి! ఆ మూటిలో రెండు లక్షలు వడీకి తిప్పాలనీ అలాగే అలుణ్ణి కూడా తన దొడ్లోనే కట్టేసుకోవొచ్చనీ ఆలోచనలో పడ్డాడు ఇటీవల.

పెళ్ళిచూపులప్పుడు, గౌరికి పూలజడ వేసి, పట్టుచీర కట్టి, బుట్టెడు నగలు దిగేసి మిగతా అలంకారాలన్నీ చేశారు.

వెంకట్రావు నల్ల ప్యాంటూ, రంగు రంగుల పువ్వులున్న తెల్ల బుష్షర్టు వేసుకొచ్చాడు.

వాళ్ళమ్మ ముందే చెపి నందువల్ల తల దించేసుకుని కూచుంది, గౌరి. వెంకట్రావు 'నీ పేరేంటి?' అని అడిగినప్పుడు—

"నా పేరే తెలవదా మా వూళ్ళో అందరికీ తెలుసు." అంటూ తల పైకెత్తితే. చూపు అతని బుష్షర్టు మీదపడి, "పువ్వులు బలే బాగున్నాయ్. మరి శీతాకోకచిలకలేవే?" అని నవ్వేసింది. పగలబడి నవ్వితే పవిట జారింది. గమనించుకోనూ లేదు.

బంతి(లా) పువ్వులా ముగ్ధమోహనంగా వున్న గౌరి వెంకట్రావుకెంతో నచ్చింది. ఆషాఢంలో కూడా దొంగ చాటుగా వొచ్చి చూసిపోయాడు.

ఆర్నెల్లకి యివాళ శోభనానికి ఘడియ కుదిరొచ్చింది. ఈ ఆర్నెల్లూ. ఆరేళ్ళ పరీక్షల చదువుకంటే కూడా ఘోరంగా అనిపించింది వెంకట్రావుకి.

కార్యానికి చెయ్యాల్సిన అట్టహాసం ఆర్భాటం అంతా చేసి, యేర్పాటు చూశారు. ఆఖరికి, తెల్లచీరా మల్లెపూలతో గౌరిని గదిలోకి పంపి. బయట గొళ్ళెం పెట్టేశారు.

గౌరి దగిరికి అడుగులువేసి నిలుచున్నాడు. తల వొంచుకునే వుంది.

"గౌరీ" అన్నాడు.

"వూఁ" అంది, తల వొంచుకునే.

"తల పైకెత్తు."

"కార్యంరోజు తలెత్తగూడదని పొర్నలత చెప్పిందిగా. నాకు దెలుసు" అంది.

సన్నగా నవ్వి 'స్వరలతెవరు?' అన్నాడు.

"మా బాబాయి కూతురు. ఇంజనీర్ని చేసుకుంది, మూడేళ్ళ క్రితం. నాకంటే ఆరేళ్ళు పెద్దది దానికిప్పుడు ఇద్దరుపిల్లలు."

"నీకూ కావాలా పిల్లలు?"

విననట్టు వుండిపోయింది.



మంచం దగ్గిరికి నడిపిస్తూ, నువ్వెంత అందంగా వుంటావనీ!' అన్నాడు.

సన్నగా నవ్వింది.

మంచం అంచు మీద కూచోబెట్టి ప్రక్కన తనూ కూచుని, "నేన్నీకు నచ్చానా?" అన్నాడు.

"వో. ఆ ముక్కే బాగాలేదు. చట్టి ముక్కు" అని ఫక్కున నవ్వింది.

పగలబడి నవ్వి. "యేం చేసేది; పోనీ నువ్వు రోజూ నా ముక్కు పుచ్చుకు లాగుతూండు. సాగుతుంది." అని సన్నగా నవ్వాడు.

'మా కౌసల్య తనన్నట్టుగా. మొగుడ్ని ముక్కు పట్టుకుని ఆటలాడిస్తుంది - అవి నన్నంటారు. అట్టా చేస్తే' నవ్వేసి —

ఆ తర్వాత శోభనపు గదిలో మామూలుగా జరిగే గ్రంథం అంతా జరిగింది. మూడుగంటలవేళకి అతనికి నిద్దొచ్చింది.

నిద్ర కుపక్రమిస్తూ. గౌరిని తనకి దగ్గిరిగా జరుపుకుని, "ఇంక పడుకుందాం. ఈ రాత్రి యెంతో బాగుంది కదూ గౌరీ!" అన్నాడు.

"బాగానే వుందిగానీ. కార్యమంటే ఇంతేనా! నేనింకేంటో అనుకున్నా........ యిదెతే మాబావ.... !"

వెంకట్రావుకి కళ్ళు తిరిగాయి. ఆనందం తాగిన ముఖం పెట్టాడా. అసహనంతో కుతకుతా వుడికిపోయాడా. యింకా లోకపు చట్రంలోకీ సెంటిమెంట్లలోకీ రంగు పూతల్లోకీ రాకుండా స్వచ్ఛంగా ప్రవిమలంగా పవిత్రంగా సౌశీల్యంగా నిలిచిన ముగ్ధ అని మురిసిపోయాడా అనహ్యంతో కవిలిపోయాడా, చెంపమీద బాది కొట్టాడా. యాడవలేక లోలోన యేడ్చాడా. మొఖాన వుమ్మేసి చరున తలుపు తీసుకు బయటికి వెళ్ళిపోయాడా. మరేం చేశాడో నన్నుమాత్రం అడక్కండి. ★


## ముఖం చూస్తే చెప్పవచ్చు!

మిత్రుడు, శత్రువు, ప్రేమిక, వంచకి, నమ్మకస్థుడు, ద్రోహి మంచివాడు, ఆత్మీయుడు. స్త్రీ పురుషుల లక్షణాలు తెలుసుకునే సూత్రాలు

అంబడిపూడి కొత్త పుస్తకం ఇది-

విజయసాధనకు మీకు ఈ పుస్తకం ముఖ్యంగా కావాలి.

మీ నిత్య జీవితంలో మీరు ఎంతో మందితో వ్యాపకాలు. పరిచయాలు పెట్టుకుంటారు. వారిని మెప్పించి ఒప్పించి పని చేసుకోవడం. వారి మానసిక స్థితిని, అంతరంగాన్ని తెలుసుకొని మసలుకోవడం అవసరం. ఏ మనిషితో ఎలా నడచుకోవాలన్నది తెలిస్తే పనులు తేలికగా జరుగుతాయి. మొహాన్నిబట్టి ఆ మనిషి అంతరంగం తెలుసుకోవచ్చు. 200 చిత్రాలు (ముఖం పోలికలు - వివరణ) ఉన్న ఈ పుస్తకం ప్రతివారికీ అవసరం. ప్రేమా, ఆదరణా మోసం అన్నీ తెలుసుకోవచ్చు. వెల : 6 రూ॥లు. 8 రూ॥లు పంపితే రిజిష్టరు పోస్టులో పంపుతాము.

జలజ ప్రచురణలు,

విజయవాడ—3.